# అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

- కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి



ప్రజావాణిలో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ మను చౌదరి

సిద్దిపేట అర్బన్, మార్చి 4: ప్రజావాణికి వచ్చే సమస్యలకు అధిక ప్రాధాన్యం ఇస్తూ వాటిని సత్వరమే పరిష్కార మార్గం చూపాలని కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్‌తో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. సమస్యలు పరిష్కారం కోరుతూ.. వివిధ ప్రాంతాల నుంచి ఎన్నో వ్యయ ప్రయాసలు కోర్చి వచ్చిన వారి ఫిర్యాదు స్వీకరించి శాఖల వారీగా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 42 ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. కార్యక్రమంలో డీఆర్వో నాగరాజమ్మ, డీఆర్డీఏ పీడీ జయదేవ్ ఆర్యా, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### సమస్యలు పరిష్కరించాలి

గజ్వేల్ అర్బన్, మార్చి 4: గజ్వేల్ పాలిటెక్నిక్ కళాశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలంటూ సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌కు తెలంగాణ పాలిటెక్నిక్ విద్యార్థుల జేఏసీ రాష్ట్ర చైర్మన్ అక్షయ్‌కుమార్ వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వం, సంబంధిత సాంకేతిక విద్యాశాఖాధికారుల దృష్టికి తమ సమస్యలను తీసుకువెళ్లి సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్‌ను కోరారు.

# రైతులను ఆదుకునేందుకు చర్యలు చేపట్టాలి

- నీటి ఎద్దడి, కరెంట్ కోతలు, లోవోల్టేజీతో సతమతమవుతున్న మెట్ట రైతులు
- కరీంనగర్ పార్లమెంట్ స్థానంలో బీఆర్ఎస్ అభ్యర్థి విజయం ఖాయం
- 12న కరీంనగర్ బహిరంగ సభకు పెద్దసంఖ్యలో జనసమీకరణ
- హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్




సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్

హుస్నాబాద్, మార్చి 4: రైతాంగాన్ని ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నీటి ఎద్దడితో పాటు కరెంట్ కోతలు, లోవోల్టేజీతో హుస్నాబాద్ నియోజకవర్గ ప్రజలు సతమతమవుతున్నారన్నారు. నిత్యం మోటర్లు కాలిపోయి వేలాది రూపాయలు ఖర్చు చేస్తూ ఆర్థికంగా నష్టపోతున్నారని గుర్తుచేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందించి రైతుల సమస్యల పరిష్కారానికి మార్గాలను అన్వేషించాలన్నారు. భవిష్యత్‌లో రైతులకు నీటి ఇబ్బందులు తలెత్తకుండా మేడిగడ్డను రిపేరు చేయించి గోదావరి నీటిని రిజర్వాయర్లకు మళ్లించాలని కోరారు. తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ అధికారంలో ఉన్న సమయంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తలేదన్నారు. కరీంనగర్ పార్లమెంట్ స్థానంలో బీఆర్ఎస్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ విజయం ఖాయమన్నారు. ఈ నెల 12వ తేదీన కరీంనగర్‌లో జరుగనున్న ఎన్నికల శంఖారావ సభకు హుస్నాబాద్ నియోజకవర్గం నుంచి భారీ సంఖ్యలో జనసమీకరణ చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో హనుమకొండ జడ్పీ చైర్మన్ డాక్టర్ సుధీర్‌కుమార్, హుస్నాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకట్, వైస్‌చైర్‌పర్సన్ అయిలేని అనితారెడ్డి, ఎంపీపీ లకావత్ మానస, నాయకులు కర్ర శ్రీహరి, దేవేందర్‌రావు, వంగ వెంకట్రామ్‌రెడ్డి, ఎండీ అన్వర్, ఎడబోయిన తిరుపతిరెడ్డి, ఆకుల వెంకట్, చిట్టి గోపాల్‌రెడ్డి, మల్లికార్జున్‌రెడ్డి, ఆవుల మహేందర్, మున్సిపల్ కౌన్సిలర్లు, బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

### కరీంనగర్ సభను విజయవంతం చేద్దాం

హుస్నాబాద్, మార్చి 4: కరీంనగర్‌లో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నేతృత్వంలో ఈ నెల 12న నిర్వహించే భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్ కార్యకర్తలు, ప్రజాప్రతినిధులకు పిలుపునిచ్చారు. సోమవారం బీఆర్ఎస్ హుస్నాబాద్ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంపీ ఎన్నికలకు ఎప్పటి లాగే కరీంనగర్ నుంచే శంఖారావాన్ని పూరిస్తున్నామన్నారు. కరీంనగర్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థిగా బోయినపల్లి వినోద్ కుమార్‌ను అధిష్టానం ప్రకటించిందని, లక్ష మందితో సభ నిర్వహించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయని తెలిపారు.



మాట్లాడుతున్న తొగుట సీఐ లతీఫ్

## చంద్రం సేవలు మరువలేనివి

రాయపోల్, మార్చి 4: గ్రామీణ ప్రాంతం నుంచి సైనికుడి వరకు ఎదిగిన రాయపోల్ మండలం అనాజీపూర్ గ్రామానికి చెందిన నీల చంద్రం సేవలు మరువలేనివని తొగుట సీఐ లతీఫ్ అన్నారు. ఆదివారం రాత్రి నిర్వహించిన చంద్రం పదవీ విరమణ అభినందన సభకు హాజరై మాట్లాడారు. రాయపోల్ మండలం నుంచి మొదటి సైనికుడిగా నీల చంద్రం 18 ఏండ్లు దేశానికి సేవలందించారన్నారు. కార్యక్రమంలో రాయపోల్ ఎస్ఐ రఘుపతి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జడీపల్లి రాంరెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు రాజాగౌడ్, నాయకులు రవీందర్‌రెడ్డి, నీల స్వామి, రాంచంద్రం, తదితరులు పాల్గొన్నారు.

# పౌరపఠన కేంద్రాలు ప్రారంభం



పౌర పఠన కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్

చేర్యాల, మార్చి 4: మండలంలోని చుంచనకోట, ముస్త్యాల గ్రామాల్లో సోమవారం అదనపు కలెక్టర్(లోకల్ బాడీస్), జిల్లా గ్రంథాలయ సంస్థ ఇన్‌చార్జి గరీమా అగర్వాల్ పౌర పఠన మందిరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత యువతీ, యువకులు, విద్యార్థులు పౌర పఠన కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పంచాయతీ పాఠకులకు మంచినీటి సౌకర్యం, మరుగుదొడ్ల వసతి కల్పించాలన్నారు. కార్యక్రమాల్లో గ్రంథాలయ సంస్థ జిల్లా కార్యదర్శి ఏవీఎస్ రాజు, ఇన్‌చార్జి ఎంపీడీవో మహబూబ్ అలీ, పంచాయతీ అధికారి దివ్య పాల్గొన్నారు.

### నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలి

సిద్దిపేట అర్బన్, మార్చి 4: యువత నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్ అన్నారు. సోమవారం సిద్దిపేట పట్టణంలోని విపంచి కళానిలయంలో నెహ్రూ యువ కేంద్ర సిద్దిపేట ఆధ్వర్యంలో నిర్వహించిన నైబర్ హుడ్ యూత్ పార్లమెంట్ 2024 కార్యక్రమానికి హాజరయ్యారు.

# విద్యార్థులకు అండగా ఎమ్మెల్యే పల్లా

- ప్రభుత్వ పాఠశాలల్లో ఎగ్జామ్స్ కిట్ల అందజేత



గురువన్నపేటలో ఎగ్జామ్ కిట్స్ అందజేస్తున్న ఎంపీపీ, జడ్పీటీసీ

చేర్యాల, మార్చి 4: విద్యార్థులకు చదువులో ప్రోత్సహించాలని, తనవంతుగా పరీక్షలకు ఉపయోగపడేలా జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఎగ్జామ్స్ కిట్స్ అందించి అండగా నిలుస్తున్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు ఎమ్మెల్యే పల్లాకు కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థి జీవితంలో పదో తరగతి కీలకమని, త్వరలో జరగబోయే పరీక్షల్లో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు 10/10 జీపీఏ సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆకాంక్షించారు. ఇందులో భాగంగానే చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు బీఆర్ఎస్ నాయకులు పరీక్ష సామగ్రిని సోమవారం అందజేశారు. కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ అంకుగారి స్వరూపరాణి, ఎంపీపీలు బద్దిపడిగె కృష్ణారెడ్డి, వుల్లంపల్లి కరుణాకర్, తలారి కీర్తనాకిషన్, జడ్పీటీసీ సిద్దప్ప, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ రాజీవ్‌రెడ్డి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

# వైభవంగా వీరభద్రస్వామి కల్యాణోత్సవం



వీరభద్రస్వామి కల్యాణోత్సవాన్ని జరిపిస్తున్న అర్చకులు

మద్దూరు(ధూళిమిట్ట), మార్చి 4: మద్దూరు మండలంలోని లద్నూర్ వీరభద్రస్వామి ఆలయంలో భద్రకాళీసమేత వీరభద్రస్వామి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. అర్చకులు దూసకంటి నవీన్‌శర్మ, రాజేశ్‌శర్మ, రాఘవశర్మ, వేణుశర్మలు వీరభద్రస్వామి కల్యాణోత్సవాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. మాజీ ఎంపీటీసీ సలేంద్రి యాదగిరి ఆధ్వర్యంలో మహాన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. వడ్లూరి నవిత-జగదీశ్వరచారి దంపతులు పట్టువస్త్రాలు సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ప్రతికంఠం రామ్మూర్తి, విశ్రాంత ఉపాధ్యాయుడు పారుపల్లి ప్రకాశం, ఎంపీటీసీ గుజ్జుక సమ్మయ్య, పీఏసీఎస్ వైస్ చైర్మన్ ఇర్రి రాజిరెడ్డి, మాజీ సర్పంచ్‌లు సుదర్శన్, రామడుగు బాలరాజు, సురేశ్, పాలకేంద్రం చైర్మన్ బుచ్చిరెడ్డి, మాజీ ఉపసర్పంచ్ కుమారస్వామి, ఉత్సవ నిర్వాహకులు నంద బాలసిద్దులు, శరత్, దామోదర్, నర్సింహులు పాల్గొన్నారు.

# భార్యను చంపిన భర్తకు యావజ్జీవ కారాగార శిక్ష

దుబ్బాక, మార్చి 5: భార్యపై అనుమానంతో కిరోసిన్ పోసి నిప్పు అంటించి హత మార్చిన భర్తకు యావజ్జీవ కారాగార శిక్ష పడిందని దుబ్బాక ఎస్సై గంగరాజు తెలిపారు. సోమవారం సీపీ అనురాధ వివరాలు వెల్లడించినట్లు పేర్కొన్నారు. 2017 జూన్ 27న దుబ్బాక మండలం పెద్దగుండవెల్లికి చెందిన గంట రవి, తన భార్య యాదవ్వ (26)తో గొడవపడి కిరోసిన్ పోసి నిప్పంటించాడు. చికిత్స నిమిత్తం గాంధీ దవాఖానకు తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ యాదవ్వ మృతిచెందింది. ఆమె తల్లి పోచవ్వ ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై సుభాష్‌గౌడ్, సీఐ పరశురాం కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. అప్పటి నుంచి జిల్లా ప్రిన్సిపల్ డిస్ట్రిక్ సెషన్స్ కోర్టులో కేసు విచారణ జరిగింది. సోమవారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ రఘురామ్ రవిపై నేరం రుజువు కావడంతో యావజ్జీవ కారాగార శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధించారు. రవి, యాదవ్వలది ప్రేమ వివాహకం కాగా, వీరికి ఇద్దరు కూతుర్లు ఉన్నారు.

# రోడ్డెక్కిన 'డబుల్ బెడ్రూం ఇండ్ల' లబ్ధిదారులు

- హుస్నాబాద్ అంబేద్కర్ చౌరస్తాలో లబ్ధిదారుల ధర్నా



అంబేద్కర్ చౌరస్తాలో ధర్నా చేస్తున్న లబ్ధిదారులు, బీఆర్ఎస్ నాయకులు

హుస్నాబాద్, మార్చి 4: హుస్నాబాద్ పట్టణంలో ఇండ్లు లేని పేదలకు గత ప్రభుత్వం కేటాయించిన డబుల్ బెడ్రూం ఇండ్ల తుది దశ పనులు పూర్తి చేయించి నివాసయోగ్యంగా మార్చాలని పలుమార్లు అధికారులకు విన్నవించుకున్నా పట్టించుకోకపోవడంతో లబ్ధిదారులు సోమవారం హుస్నాబాద్‌లోని అంబేద్కర్ చౌరస్తాలో ధర్నా నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ఎండీ అన్వర్, నియోజకవర్గ నాయకుడు అయిలేని మల్లికార్జున్‌రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వం హయాంలో ఎన్నికల కోడ్ కారణంగా కొన్ని ఇండ్లకు సంబంధించి తుది దశ పనులు ఆగిపోయాయని, వీటిని పూర్తి చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్‌తోపాటు అధికారులకు విన్నవించినా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆరోపించారు. డబుల్ బెడ్రూం ఇండ్లు వచ్చి కూడా ఇంకా అద్దె ఇండ్లలో ఉంటూ ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. వెంటనే మంత్రి పొన్నం, అధికారులు స్పందించి పనులు పూర్తి చేయించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు చిత్తారి శ్రీనివాస్, ఇంద్రాల సారయ్య, శ్రీనివాస్, లబ్ధిదారులు పద్మ, ప్రియ, శారద, కవిత, మంజుల పాల్గొన్నారు.

# 'సీఈఐఆర్'తో ఫోన్ల రికవరీ

సిద్దిపేట అర్బన్, మార్చి 4: సెల్‌ఫోన్ ఎక్కడైనా పోయినా, ఎవరైనా దొంగిలించినా.. వెంటనే సీఈఐఆర్(సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్) లో నమోదు చేస్తే ఫోన్ రికవరీ చేసే అవకాశం ఎక్కువగా ఉంటుందని సిద్దిపేట పోలీస్ కమిషనర్ బి.అనురాధ తెలిపారు. సోమవారం సిద్దిపేట పోలీస్ కమిషనరేట్‌లో కొన్ని రోజుల క్రితం పడిపోయిన, దొంగిలించబడిన 63 సెల్‌ఫోన్లను సీఈఐఆర్ ద్వారా రికవరీ చేసి బాధితులకు అప్పగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 2023 ఏప్రిల్ నుంచి 440 సెల్‌ఫోన్‌లను సీఈఐఆర్ టెక్నాలజీ ద్వారా గుర్తించి బాధితులకు అందించినట్లు తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకు 2,100 మంది తమ ఫోన్‌లు పోయినట్లు నమోదు చేసుకున్నారని పేర్కొన్నారు. ఇందులో 657 ఫోన్లను ట్రేస్ అవుట్ చేయగా.. 440 సెల్‌ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అప్పగించామని, మిగతా వాటిని త్వరలోనే బాధితులకు అప్పగిస్తామని తెలిపారు.

# భద్రాద్రి రామయ్యకు 150కిలోల తలంబ్రాలు



వడ్లను అందజేస్తున్న భద్రాచలం ఆలయ ఏఈవో శ్రావణ్

గజ్వేల్, మార్చి 4: భద్రాచలం సీతారాముల కల్యాణోత్సవంలో గోటితో ఒలిచిన తలంబ్రాలను మాత్రమే ఉపయోగిస్తారు. అందులోభాగంగా గజ్వేల్‌కు చెందిన రామకోటి భక్తసమాజం సంస్థకు 150 కిలోల వడ్లను తలంబ్రాలుగా గోటితో ఒలిచేందుకు అవకాశం లభించింది. ఈ అవకాశం లభించడం పట్ల రామకోటి రామరాజు సంతోషం వ్యక్తం చేశారు. గతేడాది 20 కిలోలు మాత్రమే ఇచ్చిన ఆలయ నిర్వాహకులు ఈ ఏడాది 150కిలోలను అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ ఏఈవో శ్రావణ్ మాట్లాడుతూ గతేడాది ఇచ్చిన 20కిలోలను గ్రామాల్లో భక్తులతో తలంబ్రాలుగా ఒలిచి ఇవ్వడంతో ఈ ఏడాది 150 కిలోలు అందజేసినట్లు తెలిపారు.

# చేర్యాల పట్టణ సమగ్రాభివృద్ధికి కృషి



కొమ్మూరి ప్రతాప్‌రెడ్డికి జ్ఞాపిక అందజేస్తున్న కేపీఆర్ కాలనీవాసులు

చేర్యాల, మార్చి 4: పాత నియోజకవర్గమైన చేర్యాలను సమగ్రంగా అభివృద్ధి చేయడమే తన ధ్యేయమని, చేర్యాల మున్సిపాలిటీలో విడతల వారీగా కాలనీలను ఆదర్శంగా తీర్చిదిద్దుతానని జనగామ డీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలో కొమ్మూరి ప్రతాప్‌రెడ్డిని సాయి కేపీఆర్ నగర్‌వాసులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి సన్మానించారు. కాలనీ అభివృద్ధికి రూ.1.60 కోట్లు నిధులు కేటాయించడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కొమ్మూరి మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నానన్నారు. అనంతరం సాయి కేపీఆర్ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్‌ను ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, అధ్యక్షుడిగా వంగపల్లి వెంకటేశం, ప్రధాన కార్యదర్శిగా ప్రముఖ న్యాయవాది ఆరెల్ల వీరమల్లయ్యగౌడ్, ఉపాధ్యక్షులుగా ఇర్రి వెంకట నర్సింహారెడ్డి, గందె వేణుగోపాల్, కోశాధికారిగా రాసూరి శ్రీనివాస్, సహాయ కార్యదర్శులుగా బూరుగు సత్యనారాయణ, బొడ్డు గౌరినాథ్, కమిటీ సభ్యులుగా అల్లం రవికుమార్, మేడిచెల్మి రాకేశ్, యాంసాని మల్లికార్జున్, నోముల సంతోష్, మలిపెద్ది రామకృష్ణను కాలనీవాసులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

# 'పల్స్ పోలియో' నిర్వహణపై ఆరా



లద్నూర్‌లో పల్స్ పోలియో కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న స్టేట్ మానిటరింగ్ ఆఫీసర్

మద్దూరు(ధూళిమిట్ట), మార్చి 4: మద్దూరు మండలంలోని లద్నూర్‌లో కొనసాగుతున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని స్టేట్ మానిటరింగ్ ఆఫీసర్ ప్రమీల పరిశీలించారు. ఇంటింటికీ వెళ్లి పిల్లలకు పోలియో చుక్కలు వేశారా, లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో అమలవుతున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని క్షుణ్ణంగా పరిశీలించేందుకు గ్రామాల్లో రాష్ట్ర బృందం పర్యటిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీపీహెచ్ఎన్‌వో ఏసు మేరి, వైద్యులు డాక్టర్ సుధీర్‌రాజ్, డాక్టర్ స్టువర్ట్‌సన్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌కు ప్రజలే బుద్ధి చెబుతారు



మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

నంగునూరు, మార్చి 4: కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలే బుద్ధి చెబుతారని జడ్పీటీసీ ఉమ, మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు లింగం గౌడ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పాలనలో మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు సహకారంతో నంగునూరులో 40 వేల ఎకరాల్లో రెండు పంటలు పండాయని, గుంట కూడా ఎండిపోలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక పంటలు ఎండిపోతున్నాయని, కాళేశ్వరంపై రాద్ధాంతం చేయడం మానుకొని, చిత్తశుద్ధితో పంటలకు సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్‌పై కోపంతో రైతులకు ఇబ్బంది కలిగించవద్దన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు దువ్వల మల్లయ్య, ఎడ్ల సోమిరెడ్డి, కోల రమేశ్‌గౌడ్, లక్ష్మారెడ్డి, కిష్టారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# డ్రోన్ సేవలను రైతులు వినియోగించుకోవాలి

మర్కూక్, మార్చి 4: వరి పొలాల్లో డ్రోన్ ద్వారా మందు పిచికారీ చేసుకుంటే రైతులకు ఖర్చులు తగ్గుతాయని ఏఓ నాగేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని కొండపోచమ్మ రైతు ఉత్పత్తిదారుల సంస్థ ఆధ్వర్యంలో పొలాల్లో డ్రోన్ ద్వారా పిచికారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇఫ్కో సంస్థ అందించిన డ్రోన్‌ను రైతులు వినియోగించుకోవాలని కోరారు. ప్రస్తుతం కూలీల కొరతను తీర్చేందుకు, తక్కువ సమయంలో ఎక్కువ విస్తీర్ణంలో మందు పిచికారీ చేసేందుకు డ్రోన్ ఉపయోగపడుతుందని తెలిపారు. డ్రోన్ వినియోగంతో పిచికారీకి అవసరమయ్యే నీరు, వాతావరణ కాలుష్యం తగ్గుతుందని చెప్పారు. ఇఫ్కో జిల్లా అధికారి చంద్రబాబు మాట్లాడుతూ రైతులు నానో యూరియాను వాడాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

# ఇసుక డంప్ సీజ్

మద్దూరు(ధూళిమిట్ట), మార్చి 4: అక్రమంగా ఇసుక రవాణా చేస్తే సహించేది లేదని మద్దూరు ఎస్సై షేక్ యూనూస్ అహ్మద్ అన్నారు. సోమవారం కమలాయపల్లిలో అక్రమంగా ఇసుకను డంప్ చేశారనే సమాచారంతో పోలీసులు గ్రామంలో వేసిన ఇసుక డంప్‌లను సీజ్ చేశారు.

### ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

బెజ్జంకి, మార్చి 4: మండలంలోని గాగిల్లాపూర్, కోహెడ మండలాల్లోని తంగళ్లపల్లి శివారులో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను సోమవారం స్థానిక పోలీసుల సహకారంతో పట్టుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ అధికారులు తెలిపారు.

### రేషన్ బియ్యం పట్టివేత

కొమురవెల్లి, మార్చి 4: ఐనాపూర్ నుంచి సోమవారం ఆటో ట్రాలీలో అక్రమంగా తరలిస్తున్న 15 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని రసూలాబాద్ సమీపంలో కొమురవెల్లి పోలీసులు పట్టుకున్నారు. నిందితులు కడమంచి తిరుపతితోపాటు ఐనాపూర్ నరేశ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగరాజు తెలిపారు.

## పొద్దుతిరుగుడు కొనుగోలు కేంద్రం ప్రారంభం

చిన్నకోడూరు, మార్చి 4: రైతులు పొద్దుతిరుగుడు కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని జడ్పీ చైర్‌పర్సన్ వేలేటి రోజాశర్మ అన్నారు. మండల కేంద్రమైన చిన్నకోడూరులో సోమవారం పొద్దుతిరుగుడు కొనుగోలు కేంద్రాన్ని ఎంపీపీ కూర మాణిక్యరెడ్డితో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్లు కనకరాజు, సదానందం గౌడ్, వైస్ ఎంపీపీ పాపయ్య, మాజీ సర్పంచ్‌లు, రైతులు పాల్గొన్నారు.

## కొమురవెల్లిలో 'కనువిప్పు'

కొమురవెల్లి, మార్చి 4: మూఢ నమ్మకాలతో ఎన్నో అనర్థాలున్నాయని చేర్యాల సీఐ శ్రీను అన్నారు. ఆదివారం రాత్రి కొమురవెల్లి మల్లన్న ఆలయ ఆవరణలోని తోటబావి చౌరస్తా వద్ద సిద్దిపేట పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు కనువిప్పు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రోడ్డు ప్రమాదాలు, సైబర్‌నేరాలు, హెల్మెట్ వినియోగం, మూఢనమ్మకాలు, మంత్రాలు, తంత్రాలు, సామాజిక రుగ్మతలు తదితర అంశాలపై ఎల్ఈడీ స్క్రీన్ ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. ఎవరైనా చట్టవ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే డయల్ 100 లేదా పోలీస్ కంట్రోల్ రూమ్ నంబర్ 87126 67100కు సమాచారం అందించాలని కోరారు. కొమురవెల్లి ఎస్సై నాగరాజు, పోలీస్ కళాకారులు, సిబ్బంది, పాల్గొన్నారు.

## ట్రాక్టర్ దహనం

మిరుదొడ్డి, మార్చి 4: గుర్తుతెలియని వ్యక్తులు ట్రాక్టర్‌ను దహనం చేసిన ఘటన మిరుదొడ్డి మండల కేంద్రంలో సోమవారం చోటుచేసుకుంది. బాధితుడు కూంచగారి దుర్గయ్య తెలిపిన వివరాల ప్రకారం.. వ్యవసాయ పనులు ముగించుకొని ఆదివారం రాత్రి తన పొలం వద్ద ట్రాక్టర్‌ను ఉంచి ఇంటికి వెళ్లాడు. సోమవారం ఉదయం వెళ్లి చూడగా ట్రాక్టర్ పూర్తిగా కాలిపోయి కనిపించింది. వెంటనే బాధితుడు మిరుదొడ్డి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఆయిల్ పామ్ తోట దగ్ధం

నంగునూరు, మార్చి 4: ప్రమాదవశాత్తు నిప్పు అంటుకొని ఆయిల్‌పామ్ తోట దగ్ధమైన ఘటన మండల పరిధిలోని మైసంపల్లిలో సోమవారం చోటుచేసుకుంది. బాధిత రైతు దుర్గారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మూడేండ్ల క్రితం మూడెకరాల్లో ఉపాధి హామీ పథకంలో భాగంగా ఆయిల్ పామ్ మొక్కలు నాటాడు. పంట చేతికి వచ్చే సమయంలో నిప్పంటుకొని తోటలోని 171 చెట్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. ఆయిల్ పామ్ మొక్కలతోపాటు అందులో ఉన్న డ్రిప్ పైపులు, స్ప్రింక్లర్లు సైతం కాలి బూడిదైనట్లు వాపోయాడు. దగ్ధమైన ఆయిల్‌పామ్ తోటను పంచాయితీ సెక్రటరీ, ఫీల్డ్ అసిస్టెంట్, ఉపాధిహామీ సిబ్బంది పరిశీలించారు.

## తాగునీటికి ఇబ్బందులుండొద్దు

సిద్దిపేట అర్బన్, మార్చి 4: వేసవి దృష్ట్యా తాగు నీటి ఎద్దడి లేకుండా మిషన్ భగీరథపై స్పెషన్ డ్రైవ్ నిర్వహించాలని రాష్ట్ర పంచాయతీరాజ్ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా అధికారులను ఆదేశించారు. సోమవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర పంచాయతీరాజ్ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా అన్ని జిల్లాల స్థానిక సంస్థల అదనపు కలెక్టర్లు, జిల్లా పంచాయతీ, మిషన్ భగీరథ, డీఆర్‌డీఏ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ నెల 7 నుంచి 15వ తేదీ వరకు గ్రామాల్లో తాగునీటి పైప్ లైన్లు, ట్యాంకుల మరమ్మతులు చేపట్టాలన్నారు.

# నాడు ఫోన్ చేస్తే నీళ్లు వచ్చేవి

- దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి



తిమ్మక్కపల్లిలో డ్రైనేజీల నిర్మాణాలకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

రాయపోల్, మార్చి 4: గతంలో ఫోన్ చేయగానే కాల్వలకు నీళ్లు విడుదల చేసేవారని, రైతులు వేసిన పంటలు ఎండిపోతున్నా పట్టించుకోవడం లేదని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి ఆరోపించారు. సోమవారం రాయపోల్ మండలంలోని తిమ్మక్కపల్లిలో జడ్పీ నిధుల నుంచి రూ.8 లక్షలతో డ్రైనేజీల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మేడిగడ్డ వద్ద తాత్కాలిక ప్రాతిపదికన కాపర్ డ్యాం ఏర్పాటు చేసి నీళ్లను ఎత్తిపోయాలన్నారు. నీళ్లు లేక ఇప్పటికే పొలాలు ఎండిపోతున్నాయన్నారు. ఇంకో 45 రోజులు నీళ్లు అవసరం ఉంటాయని తెలిపారు. బీఆర్ఎస్ మీద కోపంతో రైతులను ఇబ్బంది పెట్టవద్దన్నారు. మల్లన్నసాగర్, కొండపోచమ్మ ప్రాజెక్టుల ద్వారా చెరువులు నింపి రైతులను ఆదుకోవాలన్నారు. కేసీఆర్ సర్కార్ హయాంలో కరెంట్, సాగు నీటికి కొదువ ఉండేది కాదని గుర్తుచేశారు. సాగునీళ్లు విడుదల చేయకపోవడంతో కుడవెళ్లి వాగులో చెక్‌డ్యాంలు కూడా నిండలేదన్నారు. కార్యక్రమంలో రాయపోల్ జడ్పీటీసీ యాదగిరి, తహసీల్దార్ దివ్య, ఇరిగేషన్ అధికారులు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వెంకటేశ్వర శర్మ, నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, మున్నా, సత్యం, మురళి, గణేశ్, మంజూర్, నర్సింలు, మల్లాగౌడ్, రాజిరెడ్డి, రాజిరెడ్డి, ఇప్ప దయాకర్ పాల్గొన్నారు. అనంతరం దౌల్తాబాద్ మండలం సూరంపల్లిలో ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి పర్యటించారు. గ్రామ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బస్టాండ్ వద్ద కొత్తగా ఏర్పాటు చేసిన హెయిర్ సెలూన్ షాపును ప్రారంభించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రణం శ్రీనివాస్‌గౌడ్, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు దేవేందర్, యాదవరెడ్డి, నర్సింహులు పాల్గొన్నారు.

# దేవులపల్లి రమేశ్‌కు గుర్రం జాషువా పురస్కారం



అవార్డు అందుకుంటున్న దేవులపల్లి రమేశ్

నంగునూరు, మార్చి 4: హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో అంతర్జాతీయ సాహిత్య సాంస్కృతిక సామాజిక సేవా సంస్థ, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంయుక్తంగా గుర్రం జాషువా స్మారక కళాపరిషత్ 36వ వార్షికోత్సవం సందర్భంగా జాతీయ స్థాయి కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ సమ్మేళనంలో నంగునూరు మండల కేంద్రానికి చెందిన దేవులపల్లి రమేశ్‌కు గుర్రం జాషువా అవార్డును అందించి ఘనంగా సన్మానించారు.

# బస్సు రాగానే తుర్రుమన్న ప్రయాణికులు!



ప్రయాణికులను ఎక్కించుకువెళ్తున్న ఆటోను ఆపుతున్న మరో ఆటో డ్రైవర్



ఆర్టీసీ బస్సు రాకతో ఆటో నుంచి బస్సు ఎక్కుతున్న ప్రయాణికులు

కొండపాక, మార్చి 4: కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్ సర్వీస్ ఇస్తుండడంతో గిరాకీ తగ్గి ఆటో డ్రైవర్లు ఇబ్బందులు పడుతున్నారు. సోమవారం కొండపాక మండలంలోని వెలికట్టె చౌరస్తాలో చేర్యాల వైపు వెళ్లే ప్రయాణికులు సిద్దిపేట నుంచి అప్పుడే వచ్చిన ఆటో ఎక్కారు. దీంతో అప్పటికే అక్కడే ఉన్న ఆటో డ్రైవర్లు ఎలా ఎక్కించుకుంటావని సదరు ఆటో డ్రైవర్‌తో కయ్యానికి దిగారు. ఇరువురు గొడవ పడుతుండగా మధ్యలో ఆర్టీసీ బస్సు రావడంతో ఆటో ఎక్కిన ప్రయాణికులు దిగి బస్సు ఎక్కి వెళ్లిపోయారు. దీంతో నెత్తిన చెయ్యిపెట్టుకోవడం ఆటో డ్రైవర్ల వంతైంది.

**కర్ణాటక బ్యాంక్ లిమిటెడ్**
(నమోదిత మరియు ప్రధాన కార్యాలయము : మంగళూరు)
మీ కుటుంబ బ్యాంక్, భారతదేశమంతటా

రీజనల్ ఆఫీస్: హైదరాబాద్, ప్లాట్ నం. 50, 1వ అంతస్తు, శ్రీనగర్ కాలనీ, బంజారా హిల్స్, రోడ్ నం. 3, హైదరాబాద్ - 500 073, ఫోన్: 040-23732072 CIN: L85110M1924PLC001128

సిద్దిపేట బ్రాంచి: డోర్ నం. 2-2-2, కర్ణాటక బ్యాంక్, అంబేద్కర్ నగర్, కరీంనగర్ రోడ్, సిద్దిపేట - 502103, తెలంగాణ. ఫోన్: 83310 44985, 83310 45985.

**బంగారు ఆభరణముల వేలం ప్రకటన**

దిగువ నిర్దిష్టపరిచిన వ్యక్తి బంగారు ఆభరణాలు తాకట్టుపై రుణములను వినియోగించుకున్నారు మరియు ఎన్ని డిమాండ్ నోటీసులు ఇచ్చినప్పటికీ చెల్లించలేదు. కాబట్టి నోటీసుద్వారా తెలియజేయునది ఏమనగా తే: 14-03-2024 నాడు లేదా ముందుగా అసలు/వడ్డీ, పేపర్ ప్రకటన ఖర్చులు మరియు ఇతర ఛార్జీలు కలిపి చెల్లించక పోయినట్లయితే తాకట్టు పెట్టిన బంగారు ఆభరణాలను తే: 15-03-2024వ తేదీన ఉ॥ 3.30 గం॥లకు బ్యాంక్ యొక్క ప్రాంగణంలో బ్యాంక్ యొక్క రూల్స్ మరియు రెగ్యులేషన్స్‌లకు లోబడి వేలం వేయబడును. ఎటువంటి తదుపరి నోటీసు లేకుండా మరియు ఎటువంటి కారణములు చూపకుండా వేలాన్ని రద్దు పరుచుటకు/వాయిదా వేయుటకు బ్యాంక్ వారికి హక్కులు కల్పించబడినవి.

| బంగారు ఋణం ఖాతా నం. | ఋణ గ్రహీత పేరు | 05-03-2024 నాటికి బకాయిపడిన మొత్తము రూ. + తదుపరి వడ్డీ మరియు + ఇతర ఛార్జీలు |
|---|---|---|
| 98570021 00066501 | మొహమ్మద్ ఫయాజుద్దీన్ | రూ. 1,79,766/- |

ప్రదేశం: సిద్దిపేట
తేదీ: 05-03-2024
అసిస్టెంట్ జనరల్ మేనేజర్
రీజనల్ ఆఫీస్, కర్ణాటక బ్యాంక్ లిమిటెడ్